

చకచకా ఆధునికీకరణ

వైరా రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులు వేగంగా చేపడుతున్నారు. కాల్వలకు గైడ్ వాల్స్ పనులు చివరిదశకు చేరాయి. 8లో



రాజీవ్ యువ 'విలాపం'!

నిరుద్యోగులకు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించి, అమలును వాయిదా వేయడంతో అర్హుల్లో నిరాశ అలుముకుంది. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. సాయంత్రం వరకు ఉష్ణోగ్రత తీవ్రత కొనసాగే అవకాశముంది.

న్యూస్‌రీల్

టీపీసీసీ జనరల్ సెక్రటరీగా రాగమయి

- ఉమ్మడి జిల్లా నుంచి మరికొందరికి కూడా స్థానం



సత్తుపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో జిల్లా నాయకులు పలువురికి స్థానం దక్కింది. ఈమేరకు 27మంది ఉపాధ్యక్షులు, 69మంది ప్రధాన కార్యదర్శులతో ఏఐసీసీ నుంచి సోమవారం జాబితా విడుదలైంది. ఇందులో ప్రధాన కార్యదర్శులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సహా పలువురికి చోటు కల్పించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు చెందిన మద్దినేని బేబీ స్వర్ణకుమారి, నాగా సీతారాములు, కట్ల రంగారావు జాబితాలో ఉన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కే.సీ.వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటీ శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అప్రమత్తతే కీలకం

ఖమ్మం రాపర్తినగర్: వరదల వంటి ప్రకృతి విపత్తుల సమయాన అప్రమత్తంగా ఉంటేనే ప్రమాద తీవ్రత తగ్గుతుందని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే.ఆర్.గౌతమ్ తెలిపారు. గత ఏడాది మున్నేటి వరదతో నష్టం ఎదురుకాగా ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. యువజన సంఘాలకు ఏర్పాటుచేసిన ఈ సదస్సులో గౌతమ్ మాట్లాడుతూ వరదల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వరద ముంచెత్తినా సురక్షితంగా బయటపడడం, వరదల్లో మునిగిన వారికి ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి మాట్లాడగా ఏఎస్సై మద్దిలేటి, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఉద్యోగులు జగదీష్, ఉదయ్‌కుమార్‌తో పాటు గౌస్, ఉమాశంకర్, సునీల్, రాము పాల్గొన్నారు.

బడుల బలోపేతం, నాణ్యమైన విద్య

ఖమ్మం అర్బన్: బడి ఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని, తద్వారా పాఠశాలలు బలోపేతం కావడమే కాక విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం 55వ డివిజన్ వేణుగోపాలనగర్‌లో సోమవారం నిర్వహించిన బడిబాట ర్యాలీ, సమావేశంలో కార్పొరేటర్ శ్రావణిసుధాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు తోడు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, నాణ్యమైన భోజనం అందుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికా సంరక్షణ కమిటీ చైర్‌పర్సన్ భారతిరాణి, ఏఏపీసీ చైర్‌పర్సన్ గోపికుమారి, ఎన్నెస్పీ హైస్కూల్ హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లుతో పాటు పి.వెంకటేశ్వర్లు, జ్యోతి, సత్యవతి, వెంకటలక్ష్మి, కుమార్, ప్రసాద్, రమేష్, పుల్లారావు, నవీన్ పాల్గొన్నారు.

ప్రవేశాల సంఖ్య మరింత పెరగాలి



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

వైరా: పదో తరగతి తర్వాత విద్యార్థులెవరూ చదువు మానేయకుండా చూస్తూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవిబాబు సూచించారు. వైరా జూనియర్ కళాశాలను సోమవారం తనిఖీ చేసిన ఆయన అధ్యాపకులతో సమావేశమయ్యారు. ప్రతీ అధ్యాపకుడు ఓ ప్రభుత్వ పాఠశాలకు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల తల్లిదండ్రులను కలవాలని తెలిపారు. తద్వారా కాలేజీల్లో ప్రవేశాలు పెంచడమే కాక మెరుగైన బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కాగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు నడిపించేలా అధికారులతో చర్చిస్తున్నామని డీఐఈఓ తెలిపారు. ప్రిన్సిపాల్ నవీనజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

30వరకు బియ్యం పంపిణీ

నేలకొండపల్లి: రేషన్‌షాపుల ద్వారా ఒకేసారి మూడు నెలల బియ్యం ఇస్తుండడం, కార్డుదారుల నుంచి ఆరేసి సార్లు వేలిముద్రలు వేయిస్తుండడంతో జాప్యం జరుగుతుండగా రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీనెల 15వ తేదీ వరకు బియ్యం ఇస్తుండగా, ఈసారి 30వ తేదీ వరకు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ విషయం అందరికీ తెలిసేలా దుకాణాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేయాలని డీలర్లను డీసీఎస్‌ఓ ఆదేశించారు.



కష్టమెదురైనా నష్టపోకుండా..

మున్నేటికి గత ఏడాది వచ్చిన వరదతో పరీవాహక ప్రాంతం అల్లకల్లోలమైంది. పెద్దసంఖ్యలో ప్రజలు ఇళ్లు, సామగ్రి సహా సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సాయం అందించినా పూడ్చలేని నష్టం జరగడంతో స్థానికులు కోలుకోవడానికి నెలలు పట్టింది. మరోమారు వరద వచ్చినా బాధితులకు ఆస్తినష్టం నుండి దీర్ఘకాలిక రక్షణ కల్పించేలా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు సమగ్ర బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలు, వ్యాపారాలకు ఆర్థిక భద్రత లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పరీవాహక ప్రాంత ప్రజలు బీమా చేయించుకుంటే ప్రభుత్వ పరిహారంతో పాటు బీమా నగదు అందే వీలుంది. తద్వారా ప్రభుత్వంపై భారం తగ్గడంతో పాటు ప్రజలకు ఉపశమనంగా ఉంటుంది. – ఖమ్మంమయూరిసెంటర్

ముంపు ప్రాంతాల ప్రజల ఆస్తులకు బీమా

- వరదలతో వచ్చే నష్టాన్ని పూడ్చేలా అధికారుల నిర్ణయం
- ఇళ్లు, వాహనాలు, దుకాణాలు, సామగ్రి ఇన్సూరెన్స్‌కు ప్రణాళిక
- నేటి నుంచి పరీవాహక ప్రాంతాల ప్రజలకు అవగాహన

మున్నేటి వరద కష్టాలు

ఇటు ఖమ్మం కార్పొరేషన్, అటు ఖమ్మం రూరల్ మండలాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న మున్నేరు నది వర్షాకాలంలో ఉగ్రరూపం దాల్చడం సాధారణంగా మారింది. గత మూడేళ్లుగా మున్నేటికి వరుసగా వరదలు వస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్ 1న వచ్చిన వరద తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఇటుక ఇళ్లు, చిన్నపాటి వ్యాపారాలు, వాహనాలు, గృహోపకరణాలు వరద ప్రవాహంలో కొట్టుకుపోవడమో లేదా దెబ్బతినడంతో స్థానికులు కోలుకోలేని ఆస్తి నష్టాన్ని చవిచూశారు. అంతకు ముందు వచ్చిన వరదలు కూడా వేలాది మంది ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయి. ఈమేరకు ప్రభుత్వం ఇచ్చే తక్షణ సాయం మాత్రమే దీర్ఘకాలిక పరిష్కారం కాదని భావించిన అధికారులు శాశ్వత ఆర్థిక భద్రత కోసం బీమానే సరైన మార్గమని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ప్రయోజనాలపై చర్చ..

లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే వారితో బీమా చేయించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అధికారులు చర్చించినట్లు తెలిసింది. వరదలతో ఎదురయ్యే ఆర్థిక నష్టానికి ఈ బీమా పథకం రక్షణ కవచంగా ఉంటుందని బీమా కంపెనీల ప్రతినిధులు చెప్పినట్లు సమాచారం. పరిహారం త్వరగా లభించడంతో నష్టపోయిన ఆస్తులను పునరుద్ధరించుకోవడానికి అవకాశముంటుందని, ప్రజలకు సైతం ధీమా ఉంటుందని వెల్లడించినట్లు తెలిసింది. ఈ సమీక్ష అనంతరం పథకం విధివిధానాలు, అమలుపై కార్యాచరణ సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నయ్యారు. ఏయే ప్రాంతాలను, ఏ విధంగా బీమా పరిధిలోకి తీసుకురావాలి, ప్రీమియం ఎంత ఉండాలి, నష్టాన్ని అంచనా వేసే విధానం ఎలా, పరిహారం చెల్లించే ప్రక్రియపై విశ్లేషణ చేస్తున్నట్లు సమాచారం.

సమగ్ర బీమా పథకం

ముంపు పాంతాల్లో ఇళ్లు, చిన్నతరహా వ్యాపార సంస్థలు, దుకాణాలు, పలు ఉత్పత్తులు, వాహనాలకు బీమా వర్తింపజేయాలనే లక్ష్యంతో కేఎంసీ అధికారులు ఉన్నారు. తద్వారా వరదలతో కలిగే నష్టానికి పరిహారం లభిస్తుందని చెబుతున్నారు. ఈమేరకు సోమవారం అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కేఎంసీ కమిషనర్ శ్రీజ.. మెప్మా, ఎల్‌డీఎం, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులతో సమావేశమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు బీమా పథకం రూపొందించడంపై చర్చించి, అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈమేరకు తొలి సదస్సును 46, 47, 48వ డివిజన్ల ప్రజల కోసం ఖమ్మం నయాబజార్ కళాశాలలో మంగళవారం నిర్వహించాలని నిర్ణయించారు.

పేదల సంక్షేమమే మా అజెండా



రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం, టీ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ తదితరులు

- దేశం అనుసరించేలా తెలంగాణలో పాలన
- పార్టీ కోసం కష్టించిన కార్యకర్తలందరికీ పదవులు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

ఖమ్మంవన్‌టౌన్/రఘునాథపాలెం: బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల ఆర్థిక విధ్వంసానికి పాల్పడినా నెమ్మదిగా సరిదిద్దుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని... తద్వారా దేశమంతా తెలంగాణను అనుసరించే స్థాయికి చేర్చామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. పదేళ్ల తెలంగాణలో ఆర్థిక విధ్వంసం కొనసాగగా.. తాము అధికారంలోకి వచ్చాక నెమ్మదిగా సరిచేస్తున్నామని చెప్పారు. రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సోమవారం వారు శంకుస్థాపన చేయగా, ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ చెప్పినట్లు కులగణన చేయడమే కాక స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. ఈ విషయంలో తొలుత అందరూ హేళన చేసినా ఇప్పుడిది దేశానికే దిక్సూచిగా మారిందని తెలిపారు. కాగా, పదేళ్ల పాటు దోపిడీ చేసిన ధనంతో బీఆర్‌ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా తిప్పికొట్టాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించాలని, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడిన ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఏడాదిలోగా పూర్తయ్యేలా తన సహకారం ఉంటుందని భట్టి తెలిపారు.

ఖమ్మం అంటేనే ధైర్యం..

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయానికి పలుమార్లు వచ్చానని తెలిపారు. ఖమ్మం అంటేనే ధైర్యమని, ఇక్కడి ప్రజల ఆశీస్సులతోనే అధికారంలోకి వచ్చామని చెప్పారు. గౌడ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేల నిధులతో కూడిన ప్రత్యేక సాయాన్ని అందిస్తామని వెల్లడించారు. ఇక్కడ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు దేవుళ్లని, పార్టీ కార్యాలయం ఆలయమని పేర్కొనగా.. కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పేందుకే ఇక్కడికి వచ్చామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వచ్చే ఎన్నికల్లో 90 సీట్లకు పైగా గెలుస్తామని, రాబోయే పదేళ్లు కూడా అధికారంలో ఉంటామని వెల్లడించారు. గౌడ హాల్ పేదలకు ఉపయోగపడేలా, సమాజానికి సేవ చేసేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళ సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు పోట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, నాగండ్ల దీపక్ చౌదరి, కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్‌గౌడ్, ఏలూరి రవి, చింతల పుష్ప, భవాని, ప్రతిభారెడ్డి, బిచ్చాల తిరుమలరావు, డాక్టర్ రాజశేఖర్, బొల్లికొండ శ్రీనివాసరావు, కత్తి నెహ్రూగౌడ్, బోయనపల్లి లక్ష్మణ్, బండి నాగేశ్వరరావు, బండి వెంకన్న, వత్సవాయి రవి, బొర్రా రాజశేఖర్, పోతగాని వెంకటేశ్వర్లు, రాహుల్, కృష్ణ, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్ ఉండొద్దు..

ప్రజావాణిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా కలెక్టరేట్‌లో సోమవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ వారం గ్రీవెన్స్ డేకు పెద్దసంఖ్యలో జనం బారులు దీరడంతో కలెక్టర్ వినతిపత్రాలు స్వీకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. శాఖల వారీగా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలే తప్ప పెండింగ్ ఉంచొద్దని తెలిపారు. ఏమైనా దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే అందుకు కారణాలను తెలియచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని.....

- ఖమ్మం కాల్వొడ్డులోని హిందూ శ్మశాన వాటిక నిర్వహణ కమిటీ బాధ్యులు మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో తమ 14 షాపులను తొలగించారని తెలిపారు. ఈ షాపుల ద్వారా వచ్చే ఆదాయంతో మధ్యాహ్న భోజనం, ఐ బ్యాంక్ నిర్వహిస్తున్నందున ప్రత్యామ్నాయం చూపాలని కోరారు.
- ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన పగడం దేవకర్మ కరోనా సమయం నుంచి స్వీపర్‌గా పని చేస్తున్న తనను ఇప్పుడు తొలగించినందున ఉపాధి కల్పించాలని విన్నవించారు.
- వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణం, టాయిలెట్ల సమస్యపై కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ నవీనజ్యోతి వినతిపత్రం అందజేశారు. దీంతో పనుల పూర్తిపై ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఏళ్లుగా తిరుగుతున్నాం...



ఖమ్మం ఇందిరానగర్ – రోటరీనగర్ మధ్యలో నా భార్య మార్తమ్మ పేరుతో 250 గజాల ఇంటి స్థలం ఉండేది. ఈ స్థలం మీదుగా ఏళ్ల క్రితం రహదారి వేశారు. అప్పట్లో ఇంటి స్థలానికి బదులు మరోచోట స్థలం ఇస్తామని అధికారులు లేఖ అందించారు. కానీ అప్పటి నుంచి తిరుగుతున్నా స్పందించడం లేదు. ఇప్పటికైనా నా సమస్యను పరిష్కరించాలి.
– మేదరమట్ల వెంకటరత్నం, ఖమ్మం

పేద మహిళల భాగస్వామ్యంతో నూతన సంఘాలు

బడి బాట, ఇందిరా మహిళా శక్తిపై మంత్రి సీతక్క

ఖమ్మం సహకారనగర్: పేద మహిళలను భాగస్వాములుగా చేస్తూ నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్క సూచించారు. సీఎస్ కె.రామకృష్ణారావుతో కలిసి బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై ఆమె సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత నవంబర్‌లో శంకుస్థాపన చేసిన మహిళా శక్తి భవనాలు త్వరగా పూర్తయ్యేలా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే, ఈనెల 12న విద్యాసంవత్సరం మొదటి రోజు పండుగ వాతావరణం ఉట్టిపడేలా పాఠశాలలను అలంకరించడమే కాక విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని తెలిపారు. కాగా, మహిళా సంఘాల ఆధ్వర్యాన పెట్రోల్ పంప్‌ల ఏర్పాటు, రైస్ మిల్లులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, ఆర్టీసీ అద్దె బస్సులు కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నందున అర్హులను గుర్తించాలని సూచించారు. ప్రతీ జిల్లాలో మహిళా సంఘాల ద్వారా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఎనిమిదెకరాల భూమి పది రోజుల్లో గుర్తించాలని తెలిపారు. అనంతరం సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ బడి బాట అమలు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ వీసీకి జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, డీఆర్డీఓ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి, డీసీఎస్‌ఓ చందన్‌కుమార్, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్ పాల్గొన్నారు.

తెరుచుకున్న ఖమ్మం మార్కెట్

ఏసీ మిర్చి క్వింటాకు రూ. 14,100

ఖమ్మంవ్యవసాయం: వేసవి సెలవుల అనంతరం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ తెరుచుకుంది. ఎండల కారణంగా నెల పాటు కొనుగోళ్లు నిలిపివేయగా, సోమవారం నుంచి లావాదేవీలు మొదలవుతాయనే సమాచారంతో రైతులు మిర్చి, తదితర పంటలను తీసుకొచ్చారు. వానాకాలం సీజన్‌లో పెట్టుబడుల కోసం ఇళ్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి, పత్తి, పెసలు, కందులను రైతులు, వ్యాపారులు అమ్మకానికి తెచ్చారు. ప్రధానంగా 38లాట్ల ఏసీ మిర్చి విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్టంగా రూ.14,100, మోడల్ ధర రూ.11,300, కనిష్ట ధర రూ.7,500గా పలికింది. ఇక నాన్ ఏసీ మిర్చి 1,500 బస్తాలు రాగా గరిష్ట ధర రూ.13,600, కనిష్ట ధర రూ.4వేలుగా నమోదైంది. అలాగే, పత్తి గరిష్టంగా రూ.6,400, కనిష్టంగా రూ.6వేలు, పెసలకు రూ.6,600, కందులు రూ.4,200, మొక్కజొన్న రూ.1,975 ధర పలికాయి. మిర్చి, అపరాల యార్డుల్లో మోడల్ మార్కెట్ నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యాన కొనుగోళ్లను పత్తియార్డులో నిర్వహించారు.



రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

నిల్వ మిర్చి ధరపై ఆశలు

కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి ధరపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. పంట సీజన్‌లో ఆశించిన ధర పలకక చాలామంది తేజా రకం మిర్చిని నిల్వ చేశారు. విదేశాల్లో డిమాండ్ ఉండే తేజా రకం మిర్చికి ఈ ఏడాది సరైన ఆర్డర్లు లేక ధర పలకటం లేదు. అయితే, ఇప్పుడు అన్ సీజన్ కావడంతో ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం సగటున రూ.12,500 వరకు పలుకుతున్న తేజా రకం మిర్చికి మరో రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు పెరిగితే చాలా మంది విక్రయించే అవకాశముంది. జిల్లాలోని కోల్డ్ స్టోరేజీల్లో 40 లక్షల వరకు మిర్చి బస్తాలు నిల్వ ఉన్నట్లు అంచనా.

కూనంనేనికి ఊరట

- కొత్తగూడెం ఎమ్మెల్యే అనర్హత పిటిషన్ డిస్మిస్
- తీర్పు వెలువరించిన హైకోర్టు
- 2024 జనవరిలో దాఖలైన పిటిషన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. అంతకుముందు ఏడాదిన్నర పాటు ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు జరిగాయి.

గెలిచిన వెంటనే..

అసెంబ్లీ ఎన్నికలు 2023 నవంబర్‌లో జరగగా, నామినేషన్ దాఖలు చేసే సమయాన ఫామ్–26 అఫిడవిట్‌లో కూనంనేని సమగ్ర వివరాలు వెల్లడించలేదని కొత్తగూడేనికి చెందిన నందూలాల్ అగర్వాల్ 2024 జనవరి 20న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కూనంనేని తన భార్య పేరును అఫిడవిట్‌లో పేర్కొనలేదని, లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ చేయించలేదనే అభ్యంతరాలను నందూలాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ కొనసాగుతుండగానే మరింత సమాచారం కోసం గతేడాది డిసెంబర్‌లో హైకోర్టు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీంతో ఈ ఏడాది జనవరిలో కూనంనేని సాంబశివరావు సుప్రీం కోర్టును ఆశ్రయించి నందూలాల్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కొట్టేయాలని కోరారు. అయితే హైకోర్టులో వాదనలు పూర్తి కాకుండా ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ కూనంనేని పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో అనర్హత కేసు ఏ మలుపు తీసుకుంటుందోననే ఆసక్తి ఆరు నెలలుగా కొనసాగింది.

గతంలో వనమాపై..

ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు, అనర్హత అంశంతో కొత్తగూడెం నియోజకవర్గం మరోసారి వార్తల్లో నిలిచింది. 2018 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు గెలిచారు. అయితే అఫిడవిట్‌లో పూర్తి వివరాలు పేర్కొనలేదంటూ ఆ ఎన్నికల్లో ఓడిపోయిన జలగం వెంకట్రావు 2020లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మూడేళ్ల విచారణ తర్వాత వనమా ఎన్నిక చెల్లదని, ఆ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలని 2023 జూలైలో తీర్పు వెలువడగా.. వనమా సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. అక్కడ విచారణ దశలో ఉండగానే 2023 నవంబర్ 30న ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో వనమా ఓడిపోగా కూనంనేని సాంబశివరావు గెలుపొందారు. ఫలితాలు వెలువడిన మరుసటి నెలలో కూనంనేని ఎన్నికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం, ఇక్కడి రాజకీయ పరిస్థితులపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది.



తుది తీర్పు వచ్చాక..

ఏడాదిన్నర వ్యవధిలో ఇటు కమిషన్, అటు హైకోర్టులో 20సార్లకు పైగా ఇరువర్గాల నడుమ వాదనలు జరిగాయి. చివరకు ఈ కేసులో తీర్పును ఈనెల 9కి రిజర్వ్ చేసినట్టు 7వ తేదీన హైకోర్టు తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. దీంతో తీర్పు ఏ రకంగా ఉంటుందనే ఉత్కంఠ రెండురోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొంది. సీపీఐతో పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కేడర్ ఈ తీర్పుపై ఆసక్తి చూపించింది. అయితే నందూలాల్ అగర్వాల్ లేవనెత్తిన అభియోగాల్లో మెరిట్స్ లేనందున పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు సోమవారం హైకోర్టు వెల్లడించింది. దీంతో కూనంనేనికి ఊరట లభించినట్లయింది.

ఖమ్మం మయూరిసెంటర్: కూనంనేని సాంబశివరావుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం హైకోర్టు తీర్పు వెలువడడంపై సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే, పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్రకంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, వివిధ ప్రజా సంఘాల నేతలు, వివిధ పార్టీల నేతలు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో ప్రసవం



బాలింత, శిశువుతో 108 సిబ్బంది

నేలకొండపల్లి: పురుటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీని 108లో ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామానికి చెందిన మేఘనకు సోమవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు వస్తుండడంతో బోనకల్ 108 సిబ్బంది ఆమెను తీసుకుని ఖమ్మం ఆస్పత్రికి బయలుదేరారు. అయితే, మార్గమధ్యలో నొప్పులు పెరగడంతో ప్రకాష్‌నగర్ వంతెనపై ఆపిన అంబులెన్స్ సిబ్బంది మనోహర్, వెంకటరావు వాహనంలో ప్రసవం చేశారు. కాగా, మేఘనకు గతంలో నలుగురు కుమార్తెలు ఉండగా, ప్రస్తుతం ఐదో ప్రసవంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం బాలింత, శిశువును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి 16నుంచి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి మూడంచెల్లో పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. తొలిదఫా ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు మండల స్థాయి ఎంపికలు ఉంటాయని వెల్లడించారు. ఆపై 25, 26వ తేదీల్లో జిల్లాస్థాయి, జూలై 1నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్ స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుతో పాటు ఇతర అంశాల్లో పోటీలు ఉంటాయని, 01-09-2016నుంచి 30-08-2017 మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తొలుత ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, వివరాలకు ఖమ్మం పటేల్ స్టేడియంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని డీవైఎస్‌ఓ సూచించారు.

ఖమ్మం మార్కెట్‌లోకి టాటా 'న్యూ ఆల్ట్రోజ్'



కారును ఆవిష్కరిస్తున్న ఏసీపీ రమణమూర్తి, రాజేంద్రప్రసాద్ తదితరులు

ఖమ్మంఅర్బన్: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ విడుదల చేసిన నూతన న్యూ ఆల్ట్రోజ్ కారును సోమవారం ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఖమ్మంలోని వీవీపీ మోటార్స్ షోరూంలో కారును నగర ఏసీపీ ఎస్.వీ. రమణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఆల్ట్రోజ్ వాహనం ఆకట్టుకునేలా ఉందని పేర్కొన్నారు. వీవీపీ సంస్థల ఎండీ వంకాయల పాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆల్ట్రోజ్ వాహనం ప్రస్తుత మార్కెట్ అత్యంత విశ్వసనీయత కలిగిన వాహనంగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వీరేన్ చౌదరి, ఆదిత్యచౌదరి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

చకచకా ఆధునికీకరణ

- వైరా రిజర్వాయర్‌కు గైడ్ వాల్స్, ఇతర నిర్మాణాలు
- సాగు సీజన్‌కల్లా మేజర్‌పనులు పూర్తి
- జూలై నుంచి సాగునీటి విడుదలకు ప్రణాళిక



లైనింగ్ పనుల్లో భాగంగా పోసిన కాంక్రీట్ బెడ్



వైరా రిజర్వాయర్ ఆధునికీరణలో భాగంగా చేపట్టిన గైడ్ వాల్ నిర్మాణం

వైరా: జిల్లాలో పెద్దదైన వైరా రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులను వేగంగా చేపడుతున్నారు. ఏళ్ల తర్వాత గతేడాది బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.42.10 కోట్లు మంజూరు చేసింది. దీంతో రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించిన నీటి పారుదల శాఖ అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఎండాకాలంలో ఎక్కువ మేర పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించడమే కాక ఈ సీజన్‌లో సాగునీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. మళ్లీ అన్ సీజన్‌లో పనులు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు.

ఏయే పనులు...

రిజర్వాయర్ ఆధునికీకరణ రెండో దశ పనులు ప్రారంభమై రెండు నెలలు అవుతోంది. ప్రధానంగా ఎడమ కాల్వ పరిధిలో ఆరు కి.మీ. మేర గైడ్ వాల్స్, మరో ఆరు కి.మీ. మేర లైనింగ్ పనులు చేడుతున్నారు. ఇక రెండు వైపులా సీసీ లైనింగ్ పనులు చేయిస్తున్నారు. అలాగే, కొండకొడిమ నుంచి గొల్లపూడి వరకు 2.75 కిలో.మీ. గైడ్‌వాల్ నిర్మాణం పూర్తయింది. ఇక కుడి కాల్వ పరిధిలో కోస్తాల నుంచి కొండకొడిమ వరకు ఈనెలాఖరు వరకు గైడ్‌వాల్ పూర్తిచేయనున్నారు. తాటిపూడి నుంచి జింకలగూడెం వరకు మూడు కి.మీ. పనులు పూర్తయ్యాయి. కాగా, గైడ్‌వాల్స్‌తో పాటు కాలువలో సిమెంట్ బెడ్ నిర్మాణం పూర్తిచేసినా లైనింగ్ పనులు మాత్రం కాస్త నెమ్మదిగా జరుగుతున్నాయి.

రెండేళ్ల గడువు

వైరా రిజర్వాయర్ ఎడమ కాల్వ పరిధి లింగన్నపేట, విప్పలమడక గ్రామాల మధ్య సీసీ బెడ్ నిర్మాణం పూర్తయింది. మొత్తంగా పనుల్లో 70 శాతం ఈనెలాఖరు నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు. కానీ లైనింగ్ పనులు మాత్రం అన్నిచోట్ల ఆలస్యమయ్యే అవకాశముంది. చాలా ప్రాంతాల్లో కాలువలు బలహీనంగా ఉండడం, నల్లరేగడి నేల కావడంతో ఇలా జరుగుతోందని చెబుతున్నారు. అయితే, 2027 జనవరి వరకు పనులు పూర్తి చేయాలనే ఒప్పందం ఉండగా, వాతావరణం సహకరిస్తే 2026 ఏప్రిల్ నాటికే పనులు పూర్తి చేస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. సీజన్‌లో నీరు విడదల చేస్తూనే, అన్ సీజన్‌లో పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు.

ఏళ్ల తరబడి ఎదురుచూపులు..

రిజర్వాయర్ ఆధునికీకరణకు మొదటిసారి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.55కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో కుడి, ఎడమ కాల్వలకు గైడ్ వాల్స్, లైనింగ్, అదనపు అలుగు వంటి పనులు చేపట్టారు. ఏళ్ల తర్వాత రెండో దశ పనులకు రూ.42.10కోట్లు మంజూరు చేయడంతో ఇప్పటికే 70శాతానికి పనులు చేరువయ్యాయి. ఈ పనులన్నీ పూర్తయితే రిజర్వాయర్ చివరి భూములకు కూడా విడుదల చేసిన మొదటి రోజే కాల్వల ద్వారా సాగునీరు అందుతుంది.

వాతావరణం సహకరిస్తే త్వరలోనే..



రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులు ఆశించిన దాని కంటే వేగంగా సాగుతున్నాయి. మధ్యలో వర్షాలు కురవడంతో కొంత జాప్యం జరిగింది. ఆతర్వాత మళ్లీ ఊపందుకున్నాయి. 70శాతం మేర పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తిచేసి జూలైలో సాగునీరు విడుదల చేయాలని భావిస్తున్నారు.

– శ్రీనివాస్, డీఈ, నీటిపారుదల శాఖ

రోడ్డుప్రమాదంలో జీపీ కార్యదర్శి మృతి

విధులకు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఘటన

పెనుబల్లి/రఘునాథపాలెం: స్కూటీపై విధులకు బయలుదేరిన పంచాయతీ కార్యదర్శిని వెనుక నుండి లారీ ఢీకొట్టడంతో అదే లారీ టైరు కింద పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన బానోతు సోనాలి(32) పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త సంపత్‌ది కల్లూరు మండలం లక్ష్మితండా కాగా వీరికి ఏడాది, నాలుగేళ్ల వయస్సు పిల్లలు ఉన్నారు. కల్లూరు నుంచి రాకపోకలు సాగించే ఆమె రోజులాగే సోమవారం తన స్కూటీపై వెళ్తుండగా అదే మార్గంలో ఖమ్మం వైపు నుండి సత్తుపల్లి వైపునకు వెళ్తున్న లారీ వీఎం బంజర్ ప్రాథమిక పాఠశాల సమీపాన వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో సోనాలి అదుపుతప్పి రోడ్డుపై పడగా, ఆమె పైనుంచి లారీ వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. సోనాలి మృతిపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సంతాపం తెలపగా, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఈఓ ఉపేంద్రయ్య, పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు.



సోనాలి (ఫైల్)

బూడిదంపాడులో అంత్యక్రియలు

గ్రామపంచాయతీ బానోత్ సోనాలి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం ఆమె స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ నివాళులర్పించారు. కాగా, పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ కార్యదర్శులపై పనిభారం పెరగడంతో ఆ ఒత్తిడితో వెళ్తున్న ఆమె ప్రమాదం బారిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోనాలి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే, పంచాయతీ కార్యదర్శులకు నిర్దిష్ట పనివేళలు, స్పష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు దుర్గాప్రసాద్, యర్రా రమేష్, కరణ్‌సింగ్, రుక్మారావు, ఫజల్, వినోద్, గాంధీ, ఉపేందర్, అనిత, సుష్మిత, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఉమాకర్(35) భార్య కొన్నేళ్ల అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపంతో బాధపడుతున్న ఆయన మద్యానికి బానిస కాగా, ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆయన తండ్రి, తమ్ముడు ఖమ్మంలో నివసిస్తున్నారు. ఈనెల 8వ తేదీన ఉమాకర్ పురుగుల మందు తాగగా గమనించిన స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా, ఆయన తండ్రి వెంకటనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కత్తులు, గొడ్డళ్లతో దాడి

కారేపల్లి: చేను గెట్ల తగాదా విషయమై పెద్ద మనుషుల సమక్షాన పంచాయితీ నిర్వహిస్తుండగా మాటామాట పెరగడంతో ఆగ్రహంతో కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసుకున్నారు. ఇద్దరికి తీవ్రగాయాలైన ఈ ఘటన కారేపల్లి మండలం మంగళితండా గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తేజావత్ మోహన్‌లాల్, పిల్లల మర్రి హుస్సేన్ నడుమ చేను గెట్ల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమాన సోమవారం గ్రామ పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహిస్తుండగా మాటామాట పెరగడంతో ఆగ్రహానికి గురైె హుస్సేన్, ఆయన కుమారులు వీరన్న, నాగరాజు కత్తులు, గొడ్డళ్లతో మోహన్‌లాల్, భారతి, నాగేందర్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో భారతి, నాగేందర్‌కు తీవ్రగాయాలు కాగా బాధితుల ఫిర్యాదుతో హుస్సేన్, వీరన్న, నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ బి.గోపి తెలిపారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెల్దారుపల్లిలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: రాష్ట్రప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో సోమవారం పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మద్దులపల్లిలో రూ.94లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశాక డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. అలాగే, పోలేపల్లి –రాజీవ్‌గృహకల్ప కాలనీ ఎన్నెస్పీ లాక్‌ల వరకు రూ.2.86కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి, తెల్దారుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజచేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల కోసం గతంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నామని తెలిపారు. ఇదే సమయాన కొత్తగా ఉచిత విద్యుత్, సన్న ధాన్యానికి బోనస్, రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయానం, ఇంది రమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాలు మొదలు పెట్టామని వెల్లడించారు. అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ బి.హరినాథ్‌బాబు, ఆర్‌డీఓ జి.నర్సింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పి.రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి కరామత్ అలీ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన ఖమ్మంలో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు లేకుండానే ఫీజులు, ఇతరత్రా పేర్లతో రూ.కోట్లలో దండుకున్నాయని ఆరోపించారు. జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితులు ఉండగా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇకనైనా ఫీజుల నియంత్రణ, అనుమతుల విషయమై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు సింగు నర్సింహారావు, ఎస్.రామకృష్ణ, ప్రవీణ్, సుధాకర్, వెంకటేశ్, లక్ష్మణ్, మస్తాన్, సురేష్, లతాదేవి, పోటు కళావతి, బేగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

విద్యారంగం అభివృద్ధికి ఏమేం చేయాలి ?



విద్యాకమిషన్ చైర్మన్ మురళితో చర్చిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మధిర: ప్రైవేట్‌కుఏ దీటుగా ప్రభుత్వ విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు ఎలాంటి సంస్కరణలు చేస్తే బాగుంటుందని విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆరా తీశారు. మండలానికి మూడు పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా మధిర నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ నేపథ్యాన విధి విధానాలు, సాధ్యాసాధ్యాలపై చర్చించేందుకు మురళి సోమవారం మధిరలో పర్యటించారు. ఈ సందర్భంగా సిరిపురం ఉన్నత పాఠశాలలో చైర్మన్, డీఈఓ ఎస్.సత్యనారాయణను పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మారెడ్డి తదితరులు కలిశారు. కొత్త పాఠశాలల ఏర్పాటుతో ప్రస్తుతం ఉన్న పాఠశాలలు బలహీనమయ్యేలా విద్యాసంస్కరణలు తీసుకురావొద్దని కోరారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థలో లోపాలను సరిదిద్దేలా విద్యావేత్తలు మేధావులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించాలని కోరారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు మొదలుపెట్టి, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయ నాయకులు జిల్లా సీహెచ్‌వీ.రవికుమార్, డి.వెంకటేశ్వరరావు, తూమాటి కృష్ణారెడ్డి, కొలగాని ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన డ్రైవర్ల ఘర్షణ

గొడవలో బిహార్‌కు చెందిన లారీ డ్రైవర్ మృతి

మధిర: మధిర మండలంలోని దెందుకూరు సమీపాన ఓ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్న ఇద్దరు లారీ డ్రైవర్ల మధ్య మొదలైన చిన్న గొడవ పెద్దదై ప్రాణాలు తీసే వరకు వెళ్లింది. అసోంకు చెందిన లారీ డ్రైవర్ మృతి చెందిన ఈ ఘర్షణ వివరాలిలా ఉన్నాయి. కన్‌స్ట్రక్షన్ కంపెనీలో బిహార్ రాష్ట్రం శివాన్ జిల్లా మదనపట్టికి చెందిన సుమంత్ కుమార్ పాండే (37), ఒడిశా రాష్ట్రానికి చెందిన శివ బిషోయ్ తదితరులు లారీడ్రైవర్లగా పనిచేస్తున్నారు. సుమంత్ అసోం రాష్ట్రానికి చెందిన మహిళను ప్రేమ వివాహం చేసుకోగా వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆమె పిల్లలతో కలిసి అసోంలోనే ఉంటోంది. కాగా, లారీ డ్రైవర్లు సహా సిబ్బంది దెందుకూరు సమీపాన కంపెనీ క్వార్టర్లలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి శివ బిషో య్ భోజనం చేశాక ప్లేట్ కడిగిన నీటిని కింద పోస్తూ వెళ్తున్నాడు. దీంతో సుమంత్ కుమార్ పాండే తన గది ముందు ప్లేట్ కడిగిన నీటిని ఎందుకు పోశావని శివపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇనుప రాడ్డుతో దాడికి యత్నించాడు. అక్కడి కూలీలు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. కొద్ది గంటల తర్వాత శివ మూత్రవిసర్జనకు వెళ్లి వస్తుండగా ఆరుబయట మంచంపై పడుకున్న సుమంత్ తిరిగి ఆయనను దూషించినట్లు తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన శివ బిషోయ్ పక్కనే ఉన్న ఇనుప రాడ్డు తీసుకొని దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సమంత్‌ను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న వైరా ఏసీపీ రహమాన్, మధిర సీఐ మధు, మధిర రూరల్ పోలీసులు సోమవారం ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అప్పటికే నిందితుడు శివ పారిపోవడంతో ఆయన సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రాజీవ్ యువ విలాపం!

- యువ వికాసం పథకం అమలులో జాప్యం
- ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతీయువకులు
- ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు 1.60 లక్షలు
- కేటాయించిన మొత్తం యూనిట్లు 38,230



క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జాప్యం జరుగుతుండటంతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మే నెలలోగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నెల 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలని భావించింది. అనంతరం ఈ నెల 5న మంత్రివర్గ సమావేశంలో యువ వికాసంపై స్పష్టత వస్తుందని అంతా భావించారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాకపోవడంతో యువతీయవకులు నిరాశ చెందుతున్నారు. దరఖాస్తులు వెల్లువలా రావడం, దరఖాస్తుల పరిశీలన ఓ కొలిక్కి రాకపోవడంతో అమలు ప్రక్రియలో జాప్యం జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీ ఇలా..

పథకంలో రూ.50వేల యూనిట్‌కు వందశాతం సబ్సిడీ, రూ.లక్ష వరకు 90 శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం సబ్సిడీ, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందించనుంది. ఈ నాలుగు కేటగిరీల్లో రూ. 50వేలు, రూ.లక్ష యూనిట్లకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

'సిబిల్'కే బ్యాంకర్ల ప్రాధాన్యం..

యువ వికాసం దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో పరిశీలించారు. తొలుత మండల కమిటీల ఆమోదం తర్వాత జిల్లా కమిటీలకు జాబితా చేరుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబంలో ఒకరికే ఈ పథకం మంజూరు చేస్తారు. గతంలో ఏదైనా కార్పొరేషన్ నుంచి లబ్ధి పొందారా?, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించకుండా డిఫాల్టర్‌గా ఉన్నారా? అనే విషయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. మరోవైపు సిబిల్ స్కోర్‌ను పట్టించుకోవద్దని ప్రభుత్వం సూచించినా బ్యాంకర్లు మాత్రం దాటికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు

కార్పొరేషన్	ఖమ్మం	భద్రాద్రి
బీసీ	39,616	20,602
ఎస్సీ	29,742	12,488
ఎస్టీ	14,416	27,792
మైనారిటీ	7,412	2,844
ఈబీసీ	4,022	1,049
క్రిస్టియన్	117	107

ఉమ్మడి జిల్లాలో 38,230 యూనిట్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి 1,60,207 మంది యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం ఉమ్మడి జిల్లాకు 38,230 యూ నిట్లను పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో ఖమ్మం జిల్లాకు 20,181యూనిట్లు, భద్రాది జిల్లాకు 18,049 యూనిట్లు కేటాయించింది. మొదటి విడతలో కేటగిరీ–1లో రూ.50 వేలు, కేటగిరీ–2లో రూ. లక్ష వరకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి ఈనెల 15లోపు శిక్షణ ఇవ్వాలని తొలుత నిర్ణయించారు. అయితే అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే పథకం జాబితాలో స్థానం కల్పిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. ఈనెల 5న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా యువ వికాసంపై ఎలాంటి చర్చ జరగలేదు. దీంతో పథకం అమలు మరింత జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

అర్హుల ఎంపికలో పొరపాట్లు..

రాష్ట్రఆవిర్భావం దినోత్సవం రోజు పథకాన్ని ప్రారంభించాలని భావించినా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం, అర్హుల ఎంపికలో పొరపాట్లు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో మరింత లోతుగా విచారణ చేయాలని నిర్ణయించారు. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సాయం అందించాలని ప్రభుత్వం భావించి కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఎప్పటికప్పుడు వాయిదా పడుతుండటంతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. కాగా పథకం అమలుకు మరో వారం, పది రోజుల్లో ప్రభుత్వం స్పష్టమైన తేదీ ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఆదేశాలు రావాల్సి ఉంది



రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఈ నెల 2న ప్రారంభించాలని భావించినా కొన్ని కారణాలతో వాయిదా వేసింది. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇక ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తాం.

–బి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ, రాజీవ్ యువ వికాసం కోఆర్డినేటర్, భద్రాద్రి జిల్లా

కొమ్మినేని అక్రమ అరెస్ట్ సరికాదు..



ఖమ్మంలీగల్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడం గర్హనీయం. ప్రభుత్వాలు ఇలా కక్ష పూరిత చర్యలు సరికాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నియంతృత్వంతో వ్యవహరించడం సమంజసంగా ఉండదు. పత్రికా స్వేచ్ఛను అణచి వేసేలా ప్రభుత్వాలు ప్రయత్నించడం శోచనీయం. మరోవైపు మీడియా కార్యాలయాలపై దాడులను కూడా ఖండిస్తున్నాం.

– కర్లపూడి శ్రీనివాసరావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఖమ్మం

భూభారతితో సమస్యలకు పరిష్కారం



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న గోపాల్‌రెడ్డి

కామేపల్లి: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందనివ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. కామేపల్లి మండలం పొన్నేకల్‌లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన రైతులందరికీ పట్టాదార్ పాసు పుస్తకాలు అందక అనేక సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ అధికారంకి రాగానే భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టడంతో గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. అనంతరం ముచ్చర్ల శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన ఆయన, గరిడేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, నాయకులు దొడ్డ వేణు, బోడా రాజేశ్‌నాయక్, వల్లభనేని అశోక్, మాలోత్ ప్రేమ్‌కుమార్, దేవండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.